సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శుక్రవారం । 31 । జనవరి । 2025



టన్ను చీనీ రూ.16 వేలు
అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.16 వేలు, కనిష్టంగా రూ.7 వేలు, సరాసరిన రూ.13 వేల ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



కిలో టమాట రూ.13
అనంతపురం కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.13, కనిష్టంగా రూ.7, సరాసరిన రూ.10 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
34.8°/09.6°
జిల్లా పరిధిలో గురువారం చలి వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

నైపుణ్యంతోనే ఉపాధి అవకాశాలు



శిక్షణ పొందిన అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందించిన దృశ్యం

మడకశిర: నైపుణ్యంతోనే నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ తెలిపారు. నిరుద్యోగ యువతీ యువకులు తప్పనిసరిగా నైపుణ్యంపై శిక్షణ పొందాలని సూచించారు. గురువారం పట్టణంలోని ఎస్‌వైటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో స్కిల్ హబ్‌లో టైలరింగ్, రిసెప్షనిస్ట్‌కు సంబంధించి శిక్షణ పొందిన 60 మంది మహిళలకు ఆయన సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతీ యువకులు స్కిల్ హబ్‌లలో శిక్షణ పొంది అభివృద్ధి చెందాలన్నారు. నైపుణ్యం ఉంటే ఉద్యోగం తప్పకుండా వస్తుందని పేర్కొన్నారు. సమావేశంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు మాట్లాడుతూ యువతీ యువకులు నైపుణ్యంపై వచ్చే శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అడిషనల్ ఎస్పీ బదిలీ



ఆర్ల శ్రీనివాసులు

పుట్టపర్తి అర్బన్: జిల్లా అడిషనల్ ఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న ఆర్ల శ్రీనివాసులు బదిలీ చేస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ కుమార్ విశ్వజీత్ గురువారం ఉత్తర్వులు విడుదల చేశారు. పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్టు చేసుకోవాలని ఆదేశించారు. ఈ ఆదేశాలు వెంటనే అమలు చేయాలన్నారు.


నేడు విద్యాసంస్థల బంద్



విలేకర్ల సమావేశంలో పాల్గొన్న ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు

ధర్మవరం: ఫీజులు చెల్లించాలంటూ విద్యార్థులను ఒత్తిడికి గురి చేస్తూ ఆత్మహత్యకు ప్రేరేపిస్తున్న నారాయణ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఐక్యవిద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. అనంతపురం నారాయణ విద్యాసంస్థల్లో ఫీజుల వేధింపుల కారణంగా ఇంటర్ ఫస్టియర్ విద్యార్థి చరణ్ ఆత్మహత్య చేసుకుని వారం రోజులైనా విద్యాసంస్థల యాజమాన్యంపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. విద్యార్థి మరణానికి కారణమైన నారాయణ కళాశాల యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేసి నారాయణ విద్యాసంస్థలను సీజ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. శుక్రవారం జరిగే విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీరేష్, నామాల నాగార్జున, ఏఐఎస్‌బీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పోతులయ్య, జగదీష్, ఎస్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు ప్రసాద్, వైఎస్సార్ ఎస్‌యూ జిల్లా అధ్యక్షులు పురుషోత్తం, ఏఐఎస్‌బీ నాయకులు తరుణ్, ఎస్ఎఫ్ఐ నాయకులు వంశీ, విక్కీ తదితరులు పాల్గొన్నారు.

డ్రిప్పు, స్ప్రింక్లర్లకు ఆన్‌లైన్‌లోనే డీడీలు తీయాలి



పుట్టపర్తి అర్బన్: ప్రభుత్వం ఏపీఎంఐపీ ద్వారా అందిస్తున్న డ్రిప్పు, స్ప్రింక్లర్లకు రైతులు ఆన్‌లైన్ ద్వారా మాత్రమే డీడీలు తీయాలని ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అవసరమైన పరికరాలకు రైతులు ఫోన్‌పే, గూగుల్ పే, నెఫ్ట్, ఆర్‌టీజీఎస్, నెట్ బ్యాంకింగ్ ద్వారా డీడీలు తీయాలని సూచించారు. కొంత మంది దుండగులు నకిలీ కంపెనీల పేర్లు చెప్పి డబ్బు కట్టించుకున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. వారిని నమ్మి రైతులు మోసపోవద్దని సూచించారు. అన్నదాతలు డబ్బు కట్టిన రెండు మూడు రోజుల్లోనే మెటీరియల్ సరఫరా చేస్తామని, ప్రతి ఒక్కరూ దీన్ని గుర్తించాలని వివరించారు.

రెచ్చ గొట్టి.. రచ్చ చేసి

- రసాభాసగా జెడ్పీ సర్వసభ్య సమావేశం
- 'సూపర్ సిక్స్'పై అడిగితే రెచ్చిపోయిన టీడీపీ ప్రజాప్రతినిధులు
- జెడ్పీటీసీలకు అడుగడుగునా అడ్డు
- ఆద్యంతం గందరగోళం
- ప్రజా సమస్యలపై చర్చించకుండానే ముగింపు



సభ్యులకు నచ్చజెబుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ. చిత్రంలో మంత్రి సవిత, జేసీ శివ్ నారాయణ్ శర్మ



సమావేశానికి హాజరైన జెడ్పీటీసీలు, ఎంపీపీలు

అనంతపురం సిటీ: టీడీపీ ప్రజాప్రతినిధుల పుణ్యమా అని అనంతపురం జెడ్పీ సమావేశం రసాభాసగా మారింది. హామీలపై ప్రశ్నించిందే తప్పన్నట్లుగా ఎమ్మెల్యేలు రెచ్చిపోయారు. అడుగడుగునా అడ్డంకులు సృష్టించారు. దీంతో ప్రజల సమస్యలు చర్చకు రాకుండానే సమావేశం ముగించాల్సి వచ్చింది. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన ఉమ్మడి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం జెడ్పీ సమావేశ ప్రధాన భవన్‌లో నిర్వహించారు. మంత్రి సవిత, విప్ కాలువ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ మంగమ్మ, హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, అనంతపురం అర్బన్, మడకశిర ఎమ్మెల్యేలు దగ్గుబాటి ప్రసాద్, ఎంఎస్ రాజు, శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్, అనంతపురం జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ హాజరయ్యారు. సీఈఓ రాజోలి వీరారెడ్డి చర్చను ప్రారంభించగా.. సభను జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ కొనసాగించారు.

ఆద్యంతం అడ్డు..

సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసేలా సభలో తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపాలని యల్లనూరు జెడ్పీటీసీ సభ్యుడు బోగాతి విజయప్రతాప్‌రెడ్డి కోరగా.. నేరుగా సమాధానమివ్వని మంత్రి సవిత, విప్ కాలవ, ఎంపీ బీకే, ఎమ్మెల్యేలు దగ్గుబాటి ప్రసాద్,రాజులు గత ప్రభుత్వంలో ఏం చేశారంటూ రెచ్చిపోయారు. అంతలోనే ఎమ్మెల్యే ఎంఎస్ రాజు... తమ ప్రభుత్వం వాట్సాప్ ద్వారా 161 సేవలను అందుబాటులోకి తెస్తోందని, సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలుపుతూ తీర్మానం చేయాలని కోరడంపై జెడ్పీ సభ్యులు మండిపడ్డారు. గత ప్రభుత్వం గురించి అనవసరమని, మీరేం చేస్తారో చెప్పాలంటూ డిమాండ్ చేశారు. తాను టీడీపీ నుంచి గెలవడంతో నిధుల కేటాయింపులో పక్షపాతం చూపారని అగళి జెడ్పీటీసీ ఉమేష్ ఆరోపించగా.. వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీలు అభ్యంతరం తెలిపారు. ఈ క్రమంలోనే ఎమ్మెల్యే రాజు సైగ చేయగా, జెడ్పీటీసీ ఉమేశ్ గట్టిగా అరుస్తూ పోడియం వద్దకు దూసుకెళ్లారు. దీంతో వైఎస్సార్‌సీపీ సభ్యులు సైతం మూకుమ్మడిగా పోడియం వైపు రావడంతో రెండు వర్గాల మధ్య వాదోపవాదాలు జరిగాయి. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ తమకు 63 మండలాలూ సమానమేనని, అన్ని ప్రాంతాలకు నిధులు కేటాయిస్తూ వచ్చామన్నారు. అగళి జెడ్పీటీసీ ఏ రోజూ తమకు పనులు కావాలని అడిగింది లేదని, 10 రోజుల క్రితం రూ.90 లక్షలకు ప్రతిపాదనలు తీసుకువచ్చి వెంటనే మంజూరు చేయాలంటూ పట్టుబట్టారన్నారు. రూ.30 లక్షలు ఇస్తున్నట్లు చెప్పినా పేపర్లు విసిరి వెళ్లిపోయాడన్నారు. సీఈఓ రామచంద్రారెడ్డి కల్పించుకుంటూ నిధులు ఇచ్చినా లేదంటూ గందరగోళం సృష్టించేందుకు ప్రయత్నించడం దురదృష్టకరమన్నారు. దీనిపై టీడీపీ ప్రజాప్రతినిధులు ప్రతిస్పందిస్తూ సభలో అల్లరి చేశారు.

తమ్ముళ్లకు పర్సంటేజీలు ఇవ్వాలట..

జెడ్పీ నిధులతో చేపట్టే పనుల్లో పర్సంటేజీలు ఇవ్వడం లేదంటూ తెలుగు 'తమ్ముళ్లు' పనులు అడ్డుకుంటున్నారని కదిరి జెడ్పీటీసీ సభ్యురాలు భుక్యా రాధాబాయి ఆరోపించారు. దీనిపై మంత్రి సవిత, విప్ కాలవ, ఎంపీ బీకే, ఎమ్మెల్యేలు దగ్గుబాటి, ఎంఎస్ రాజు అభ్యంతరం తెలపడంతో వైఎస్సార్‌సీపీ సభ్యులు దీటుగా సమాధానమిచ్చారు. బుక్కరాయసముద్రం జెడ్పీటీసీ సభ్యుడు భాస్కర్ మాట్లాడుతూ.. ఇటీవల తమ ప్రాంతానికి చెందిన ఓ బాలుడు తీవ్ర అస్వస్థతకు గురి కాగా, అనంతపురంలోని ప్రైవేటు ఆస్పత్రులకు తీసుకెళ్లారని, అయితే డబ్బు కడితేనే వైద్యం చేస్తామని చెప్పడంతో బెంగళూరుకు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మరణించినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై డీఎంహెచ్ఓ భ్రమరాంబదేవి సరైన సమాధానం చెప్పకపోవడంతో ఎంపీ బీకే ఆగ్రహం వ్యక్తం చేశారు. మడకశిర ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ.. అనంతపురం కిమ్స్ సవేరా ఆస్పత్రిలో సీఎంఆర్ఎఫ్‌కు సంబంధించి బిల్లులు ఇవ్వడం లేదని, రోగులను వేధింపులకు గురి చేస్తున్నట్లు ఆరోపించారు. తమ నియోజకవర్గంలో 108లు మూలనపడ్డాయని, ఒకే ఒక 108 పని చేస్తోందని తెలిపారు. అనంతపురం సర్వజనాస్పత్రిలో దంత సమస్యలకు వైద్యం చేయడం లేదని, చిన్న కేసునూ బయటి ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నారని నార్పల జెడ్పీటీసీ సభ్యురాలు వేదాంతం నాగరత్నమ్మ తెలిపారు. 108 అంబులెన్స్‌లో సౌకర్యాలు లేకపోవడంతో రోగులను ఆస్పత్రికి తరలించేలోపే మృత్యువాత పడుతున్నారని అనంతపురం జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్ పేర్కొన్నారు. హిందూపురంలో జిల్లా స్థాయి ఆస్పత్రి ఉన్నా.. చిన్న కేసునూ అనంతపురానికి రెఫర్ చేసి చేతులు దులుపుకుంటున్నట్లు లేపాక్షి జెడ్పీటీసీ శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. దీనిపై శ్రీసత్యసాయి జిల్లా డీసీహెచ్ఎస్ నాయక్.. డాక్టర్ల కొరతతో ఇలా చేయాల్సి వస్తోందని తెలపడంపై ఎంపీ బీకే అభ్యంతరం వ్యక్తం చేశారు. డాక్టర్ల కొరత నెపం చూపి తప్పించుకోవాలని చూడొద్దన్నారు. తమ మండలంలోనూ వైద్య సేవలు సరిగా అందడం లేదని బెళుగుప్ప ఎంపీపీ పెద్దన్న, వజ్రకరూరు ఎంపీపీ రమావత్ దేవి ఆరోపించారు.

నువ్వాగమ్మా.. నీకేం తెలీదు

జెడ్పీ సమావేశంలో ఎంపీ బీకే పార్థసారథి చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మను ఏకవచనంతో సంబోధించడం, నువ్వాగమ్మా.. నీకేం తెలీదు అంటూ తక్కువ చేసి మాట్లాడటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. అధ్యక్ష స్థానంలో ఉన్న చైర్‌పర్సన్‌ను ఏకవచనంతో మాట్లాడటం ఇదేం సంస్కారమంటూ ప్రజాప్రతినిధులతో పాటు అధికారులు కూడా చర్చించుకోవడం కనిపించింది.

కంది కొనుగోలులో ఆంక్షలా..?

కంది కొనుగోలు విషయంలో ప్రభుత్వం విధించిన ఆంక్షలు చూసి రైతులకు ఏం చేయాలో అర్థం కావడం లేదని జెడ్పీటీసీ సభ్యులు పేర్కొన్నారు. కేవలం మూడు క్వింటాళ్లు కొనాలని షరతు విధించడం సరికాదన్నారు. విప్ కాలవ స్పందిస్తూ.. బయటి మార్కెట్‌కు, ప్రభుత్వ ధరకు మధ్య క్వింటాలుకు రూ.1,000 వ్యత్యాసం ఉందని, 5 క్వింటాళ్ల వరకు ప్రభుత్వమే కొనుగోలు చేసేలా ప్రభుత్వానికి నివేదిక పంపాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. బ్రహ్మసముద్రం జెడ్పీటీసీ సభ్యురాలు ప్రభావతి మాట్లాడుతూ మామిడి రైతులను ఆదుకోవాలని కోరారు. తమ మండలంలో అన్ని శాఖలకు ఇన్‌చార్జ్ అధికారులే దిక్కు కావడంతో పనులు జరగడం లేదని చిలమత్తూరు జెడ్పీటీసీ అనూష అధికారుల దృష్టికి తెచ్చారు. వివిధ పనుల నిమిత్తం అనంతపురానికి వస్తే.. కనీసం అతిథి గృహ సదుపాయం కూడా లేదని, శిథిలావస్థకు చేరిన జెడ్పీ అతిథి గృహాలకు మరమ్మతులు చేయాలని కంబదూరు జెడ్పీటీసీ నాగరాజు కోరారు. తమ ప్రాంతానికి వచ్చే పల్లె వెలుగు బస్సుకు కండక్టర్ లేకుండా వన్‌మ్యాన్ సర్వీసును నడపడం వల్ల ఒక విద్యార్థి మృత్యువాతపడ్డాడని విడపనకల్లు జెడ్పీటీసీ హనుమంతు ఆవేదన వ్యక్తం చేశారు.



జెడ్పీటీసీ సభ్యులు మాట్లాడుతుంటే అడ్డుకుంటున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

'పురం'లో మళ్లీ క్యాంపు రాజకీయం



కౌన్సిలర్లను తరలిస్తున్న దృశ్యం



కారులో తరలివెళ్తున్న కౌన్సిలర్లు

- అడ్డదారిలో చైర్మన్ పదవి దక్కించుకునేందుకు టీడీపీ కుయుక్తులు
- కౌన్సిలర్లు హైదరాబాద్‌కు తరలింపు

హిందూపురం: ప్రజల ఆదరణతో గెలవకపోయినా అధికారాన్ని అడ్డుపెట్టుకొని అడ్డదారిలో మున్సిపల్ చైర్మన్ పదవిని దక్కించుకునేందుకు టీడీపీ కుయుక్తులు పన్నుతోంది. ఇందులో భాగంగానే మరోసారి క్యాంపు రాజకీయానికి తెర తీసింది.

గతంలో బెడిసి కొట్టిన వ్యూహం..

సార్వత్రిక ఎన్నికల పూర్తయి కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చినప్పటి నుంచి హిందూపురం మున్సిపాల్టీలో రాజకీయలు వేడెక్కాయి. ఎమ్మెల్యే బాలకృష్ణ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు మున్సిపాల్టీ పీఠం కైవసానికి ఎత్తులు వేస్తూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో 13 మంది వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లను ప్రలోభ పెట్టి తమవైపు లాక్కొని గత ఏడాది అక్టోబరు 4వ తేదీన క్యాంప్ రాజకీయం చేశారు. వారం రోజులు టూర్‌కు తీసుకెళ్లి విలాసాల్లో ముంచేత్తారు. అయితే అక్టోబరు 8వ తేదీన చైర్మన్ నోటిఫికేషన్ విడుదలయ్యే వరకూ వైస్ చైర్మన్‌నే ఆ బాధ్యతలు నిర్వర్తించేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో టీడీపీ నాయకులు ఖంగుతిన్నారు. ఆ వెంటనే క్యాంప్‌కు తీసుకెళ్లిన కౌన్సిలర్ల కుటుంబ సభ్యులతో పాటు హిందూపురానికి తీసుకొచ్చేశారు. అప్పటి నుంచి నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నారు.

మొదట ఎమ్మెల్యే బాలకృష్ణ వద్దకు..

మున్సిపల్ చైర్మన్ పదవి కోసం మరోసారి నోటిఫికేషన్ జారీ అయింది. ఫిబ్రవరి 3న బలనిరూపన, చైర్మన్ స్థానం ఎన్నికకు ఎన్నికల కమిషన్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ నేపథ్యంలో హిందూపురంలో రాజకీయాలు మళ్లీ వేడెక్కాయి. ఎమ్మెల్యే బాలకృష్ణ నేతృత్వంలో టీడీపీ నాయకులు తమవైపు ఉన్న కౌన్సిలర్లతో మరోసారి క్యాంప్‌కు బయలుదేరారు. ఇందులో వైఎస్సార్‌సీపీ నుంచి గోడదూకిన 13 మంది కౌన్సిలర్లతో పాటు టీడీపీ, బీజేపీ, ఎంఐఎంకు చెందిన 8 మంది కౌన్సిలర్లు ఉన్నారు. చైర్మన్ ఎన్నిక రోజున మున్సిపల్ కార్యాలయానికి చేరుకునేలా ప్రణాళికలతో ముందుగా హైదరాబాద్‌లో ఎమ్మెల్యే బాలకృష్ణను కలిసిందుకు వెళ్లినట్లు తెలిసింది. అక్కడి నుంచి మరో ప్రాంతానికి వెళ్లే అవకాశం ఉన్నట్లు సమాచారం.

పరిహాసంగా కూటమి పాలన



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్, చిత్రంలో సమన్వయకర్త దీపిక తదితరులు

- సాధ్యంకాని హామీలిచ్చి ఇప్పుడు ప్లేటు ఫిరాయిస్తారా?
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్

హిందూపురం: కూటమి ప్రభుత్వ పాలన పరిహాసంగా మారింది. అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలో వచ్చిన కూటమి ప్రభుత్వం మహిళలు, రైతులు, కూలీలు, విద్యార్థులు ఇలా అన్ని వర్గాలను మోసం చేసింది' అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ ధ్వజమెత్తారు. హిందూపురం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి టీఎన్.దీపికతో కలిసి పట్టణంలోని పార్టీ ఆఫీసు వద్ద ఉషశ్రీచరణ్ మీడియాతో మాట్లాడారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేస్తామని కూటమి నాయకులు ఎన్నికలకు ముందు ఊదరగొట్టారన్నారు. అయితే గద్దెనెక్కిన తర్వాత సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయలేమని ప్లేటు ఫిరాయించడం దారుణమన్నారు.

కేజీబీవీల్లోనూ అవినీతి..

కేజీబీవీ స్కూల్‌లో పిల్లలకు అరకొర భోజనాలు అందిస్తున్నారని, సరకుల సరఫరాల్లో అవకతవకలు జరుగుతున్నాయని ఉషశ్రీచరణ్ పేర్కొన్నారు. హిందూపురానికి చెందిన ఓ వ్యక్తి కేజీబీవీ స్కూల్స్‌కు సరుకులు సరఫరా చేస్తూ నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా సరుకులు కూడా తక్కువ ఇస్తున్నట్లు బయట పడిందన్నారు. మంచి భవిష్యత్ ఉంటుందని తల్లిదండ్రులు వారి పిల్లలను కేజీబీవీల్లో చేర్పిస్తే అక్కడ కూడా అవినీతికి తెరతీసి విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా దీనిపై విచారణ చేపట్టి సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బలరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కురుబ విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్ఏ శివ, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు మహేష్ గౌడ్, శ్రీరాం రెడ్డి, జిల్లా స్పోక్‌పర్సన్ శివశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పంటకు పొగ మంచు దెబ్బ

- రబీ పంటలపై తీవ్ర ప్రభావం
- చీడపీడలతో కర్షకులకు ఇబ్బందులు



గోరంట్ల మండలం కరావులపల్లిలో కళింగర పంటను కమ్ముకున్న పొగ మంచు

పుట్టపర్తి అర్బన్: ఎడతెరపి లేని వర్షాలతో ఖరీఫ్ పంటలను నష్టపోయిన రైతులకు రబీ సీజన్‌లో ప్రస్తుతం పొగ మంచు వాతావరణం బెంబేలెత్తిస్తోంది. ఉదయం 10 గంటల వరకూ కురుస్తున్న మంచుతో పంటలు ఎదుగుదల లేక రైతులు సతమతమవుతున్నారు. దీనికి తోడు రోగాలు వ్యాపించడం, వరుస మందుల పిచికారీతో ఆర్థికంగా చితికి పోతున్నారు.

పంటలకు దెబ్బ

రబీ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా వేరుశనగ, మొక్కజొన్న, రాగి, వరి, తీగ జాతి పంటలైన కళింగర, దోస, వంటి పంటలను విస్తారంగా సాగు చేశారు. ఇందు కోసం లక్షలాది రూపాయలు ఖర్చు చేశారు. అయితే మంచు ప్రభావంతో వేరుశనగ పంటకు పచ్చ పురుగు, లద్దె పురుగు ,ఆకు మచ్చ తెగులు , మొక్కజొన్నకు సుడిదోమ , కళింగర, దోస పంటలకు పచ్చ పురుగు, రసం పీల్చు పురుగు, ఆకుముడత అధికంగా వ్యాపిస్తున్నాయి. దీంతో ఒకటికి రెండు, మూడుసార్లు మందులు కొట్టాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు పొగ మంచు కారణంగా వ్యవసాయ పనులు చేసుకునేందుకు కూడా ఇబ్బందులు పడుతున్నామని కర్షకులు వాపోతున్నారు.



పుట్టపర్తి పరిధిలో పొగ మంచుతో నిండిన వేరుశనగ పంట



పుట్టపర్తి మండలం పెదపల్లిలో పొగమంచుతో అనప పంట, కొబ్బరి చెట్లు


ఎదుగుదల లోపిస్తోంది



వేసవిని దృష్టిలో ఉంచుకొని చాలా మంది రైతులు కళింగర, దోస పంటలను విస్తారంగా సాగు చేశారు. అయితే పొగ మంచు కారణంగా పంటల్లో ఎదుగుదల లోపించి చీడ పీడలు అధికమయ్యాయి. పెరిగిన ధరలతో పాటు మందుల పిచికారీ పెరడంతో ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. మందులు పిచికారీ చేయకపోతే పంటలు కోల్పోవాల్సి వస్తుంది.

– జనార్ధనరెడ్డి, రైతు, పెడపల్లి

రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి



ఖరీఫ్, రబీ సీజన్‌ల మధ్య విభిన్న వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పరిస్థితుల్లో పంటలను రక్షించుకునేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. పంటల్లో ఎదుగుదల లోపించడం, వ్యాధుల తీవ్రత అధికంగా ఉండటంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం పొగ మంచు అధికంగా కురుస్తుండడంతో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి. స్థానికంగా ఉండే వ్యవసాయాధికారుల సూచన మేరకు పంటలు కాపాడుకోవాలి.

– సుబ్బారావు, జిల్లా వ్యవసాయాధికారి

కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం



ప్రశాంతి నిలయం: బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుబ్రహ్మణ్యం ఓ ప్రకటనలో తెలిపారు. బీసీ, బ్రాహ్మణ, ఈబీసీ, కమ్మ, క్షత్రియ, రెడ్డి, వైశ్య, కాపు కార్పొరేషన్‌ల ద్వారా జిల్లాకు రూ.42.86 కోట్లతో 2004 యూనిట్లు ఈ ఆర్థిక సంవత్సరానికి మంజూరయ్యాయని పేర్కొన్నారు. బీసీ కార్పొరేషన్‌కు 1472, బ్రాహ్మణ కార్పొరేషన్‌కు 11, ఈబీసీ కార్పొరేషన్‌కు 86, కమ్మ కార్పొరేషన్ కు 46, క్షత్రియ కార్పొరేషన్‌కు 13, రెడ్డి కార్పొరేషన్‌కు 24, వైశ్య కార్పొరేషన్‌కు 17, కాపు కార్పొరేషన్‌కు 345 యూనిట్లు మంజూరయ్యాయని వివరించారు. జిల్లాలో స్థిర నివాసం కలిగిన ఆయా వర్గాల వారు ఫిబ్రవరి 7వ తేదీ లోపల ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 21 నుంచి 60 సంవత్సరాల్లోపు వారు అర్హులని, కుల ధ్రువీకరణపత్రం, రేషన్ కార్డు, వయస్సు ధ్రువీకరణపత్రం , ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతాలతో ఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

నిరుద్యోగ విముక్తి కోసం పోరుబాట

- సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్



మాట్లాడుతున్న వేమయ్య యాదవ్

కదిరి టౌన్: నిరుద్యోగ విముక్తి కోసం పోరుబాట సాగించాల్సిన తరుణం ఆసన్నమైందని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంతోష్ అన్నారు. కదిరిలోని ఎన్జీఓ హోమ్‌లో గురువారం నిర్వహించిన ఏఐవైఎఫ్ జిల్లా మహాసభకు వారు ముఖ్యఅతిథులుగా హాజరై, మాట్లాడారు. దేశంలో మతవాదుల శక్తులు పెరగడంతో ప్రజాస్వామ్యానికి ముప్పు వాటిల్లుతోందన్నారు. దేశ సంపదను అంబానీ, అదానీ చేతుల్లో ప్రధాని మోదీ పెట్టారని మండిపడ్డారు. తుంగభద్ర డ్యామ్ ఎత్తు పెంచి రాయలసీమ ప్రాంతాన్ని ఎడారిగా మార్చడానికి సన్నాహాలు చేస్తుంటే రాయలసీమలోని బీజేపీ నాయకులు ప్రశ్నించకుండా చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి నరసింహులు, డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు అంజన్‌బాబు, నాయకులు మహేంద్ర, చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా రైతు సంఘం నాయకులు కదిరప్ప, కాటమయ్య, పవన్‌కుమార్, ఆదెప్ప, రమణ, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ పరిశీలన

అమరాపురం: మండలంలోని కె.శివరం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఆ శాఖ ఎస్ఈ సురేంద్ర, డీఈ భూపతి, ఏడీ నాగన్న, ఏఈ సిద్దేశ్వర, అధికారులు గురువారం సాయంకాలం పరిశీలించారు. సాంకేతిక సమస్యలు గుర్తించేందుకు ట్రయల్ రన్ చేశారు. త్వరలో సబ్‌స్టేషన్‌ను ప్రజావినియోగంలోకి తీసుకురానున్నట్లు అధికారులు తెలిపారు.

ఇంటిపై నుంచి పడి వృద్ధుడి మృతి



మృతుడు తాడెప్ప

గుడిబండ: ప్రమాదవశాత్తు ఇంటిపై నుంచి కింద పడి ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుడిబండ మండలం ఎస్ఎస్ గుండ్ల గ్రామానికి చెందిన తాడెప్ప (64)కు భార్య పుట్టమ్మ, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. వ్యవసాయ పనులతో కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈ క్రమంలో తన ఇంటిపై ఆరబెట్టిన ఉలవలు, కంది విత్తనాలను బుధవారం రాత్రి కిందకు తీసుకువచ్చేందుకు తాడెప్ప సిద్ధమయ్యాడు. అయితే తన ఇంటిపైకి ఎక్కేందుకు మెట్లు లేకపోవడంతో పక్కనే సోదరుడి ఇంటిపైకి ఎక్కి అక్కడి నుంచి తన మిద్దెపైకి చేరుకునేందుకు ఏర్పాటు చేసుకున్న చెక్క పలకపై నడుస్తుండగా విరిగింది. దీంతో అదుపు తప్పి కిందపడిన తాడెప్ప తలకు తీవ్ర గాయమైంది. కుటుంబసభ్యులు వెంటనే మడకశిరలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక గురువారం ఆయన మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.



పసిడి.. పైపైకి

పసిడి ప్రియులకు భారీ షాక్ తగిలింది. వరుసగా రెండు రోజులు స్వల్పంగా ధర తగ్గినా పెళ్లిళ్ల సీజన్ ఆరంభానికి ఒక్క రోజు ముందు బుధవారం మళ్లీ భారీగా పెరిగి ఆల్-టైమ్-హైకి చేరుకుంది. గురువారం 24 క్యారెట్ల 10 గ్రాముల స్వచ్ఛమైన బంగారం రూ.83, 612తో ప్రారంభమై రూ.83,739 చేరుకుంది. మార్కెట్‌లో కిలో స్వచ్ఛమైన వెండి రూ.1.04 లక్షలకు చేరింది.

- 10 గ్రాముల మేలిమి బంగారం రూ.83,739
- అదే బాటలో కిలో వెండి రూ. 1.04 లక్షలు
- దిగిరాని పసిడి ధరలతో కొనుగోలుదారుల బెంబేలు
- సీజన్‌లోనూ కనిపించని కొనుగోళ్ల సందడి
- పాత నగలకు మెరుగుతో సరి పెట్టుకుంటున్న వైనం



హిందూపురం అర్బన్: అంతర్జాతీయ మార్కెట్లో చూస్తే బంగారం, వెండి ధరలు ప్రస్తుతం స్థిరంగానే ఉన్నా.. దేశీయంగా ధరలు గణనీయంగా పెరిగాయి. మార్కెట్ వర్గాల ప్రకారం గురువారం ఉదయం 10 గ్రాముల బంగారం (24 క్యారెట్ల) ధర రూ.83,739, 22 క్యారెట్ల బంగారం ధర రూ.76,761 చేరాయి. ఆర్నమెంట్‌కు వాడే వెండి కిలో రూ.96వేలతో అమ్ముడుపోతోంది. దీంతో సామాన్యుడు బంగారాన్ని కొనుగోలు చేయాలంటే బెంబేలెత్తిపోతున్నాడు.

బోసి పోతున్న దుకాణాలు..

బంగారం ధర ఒక్కసారిగా పెరిగిపోవడంతో పెళ్లిళ్ల సీజన్‌లోనూ దుకాణాలు బోసి పోతున్నాయి. ఓ వైపు డాలర్ మారకంతో పోల్చుకుంటే రూపాయి విలువ తగ్గడమే బంగారం ధర గరిష్ట స్థాయికి చేరుకున్నట్లుగా తెలుస్తోంది. జిల్లా వ్యాప్తంగా హిందూపురం, ధర్మవరం, పెనుకొండ, మడకశిర, కదిరిలో చిన్నా.. పెద్దా మొత్తంగా 200లకు పైగా బంగారం విక్రయ దుకాణాలు ఉన్నాయి. ఏటా శుభకార్యాలు పెద్ద ఎత్తున జరిగే మాఘమాసంలో బంగారం లావాదేవీలు పెద్ద ఎత్తున జరుగుతుంటాయి. సీజన్ ఆరంభానికి ముందే ఉమ్మడి జిల్లాలో రోజూ రూ. 6 కోట్ల మేర లావాదేవీలు జరిగేవి. అయితే ఇందుకు భిన్నంగా ఈ సారి కొనుగోలుదారులు లేక జిల్లాలోని బంగారం విక్రయ దుకాణాలు బోసిపోతున్నాయి. ప్రస్తుతం ధర పెరగడంతో బంగారం వ్యాపారాలు రూ.4 కోట్లకు పడిపోయినట్లుగా తెలుస్తోంది. రోజూ రూ.2కోట్ల మేర వ్యాపారం జరిగే హిందూపురం, కదిరిలోనే ప్రస్తుతం రూ. 1.20 కోట్లకు పడిపోయిందంటే పరిస్థితి ఎంతగా దిగజారిందో అర్థం చేసుకోవచ్చు.

ఉన్నవాటికే మెరుగు..

గతంలో పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలు పడితే ఇళ్లలో ఉన్న పాత బంగారం నగలను మార్పిడి కింద ఇచ్చేసి కొత్త మోడల్‌ను కొనుగోలు చేసేవారు. అయితే ధర పెరుగుదలతో కొత్త బంగారం కొనుగోలు చేయాలంటే మధ్య తరగతి ప్రజలు భయపడుతున్నారు. ఇక పేదల పరిస్థితి మరీ అధ్వానంగా మారింది. ఇంట్లో ఉన్న పాత బంగారానికి మెరుగు పట్టించి శుభకార్యాలు పూర్తి చేసేందుకు సిద్ధమవుతున్నారు.

మరింత పెరిగే అవకాశం



మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు మరింత పెరిగే అవకాశముంది. త్వరలో స్వచ్ఛమైన తులం బంగారం ధర రూ.85 వేలకు చేరుకుంటుందని అంటున్నారు. డాలర్ మారకంతో రూపాయి విలువ తగ్గడమే ఇందుకు కారణం. పెళ్లిళ్ల సీజన్ ప్రారంభమైనా దుకాణాల్లో సందడి కనిపించడం లేదు.

– నంబూరి శంకర్, రాష్ట్ర బంగారం, వజ్రాల వ్యాపారుల సంఘం గౌరవాధ్యక్షుడు, హిందూపురం

పచ్చ దౌర్జన్యం

- మొబైల్ క్యాంటీన్ తొలగించాలంటూ నిర్వాహకురాలిపై దాడి
- ఫిర్యాదు చేస్తే స్పందించని పోలీసులు
- ఫిర్యాదు వెనక్కు తీసుకోకపోతే జైలుకు పంపుతామంటూ బెదిరింపులు



టీడీపీ నేతల దాడిలో పగిలిన ఫోన్‌ను చూపుతున్న బాధితురాలు

సాక్షి టాస్క్‌ఫోర్స్: వైఎస్సార్‌సీపీ హయాంలో పచ్చగా బతికిన బడుగులపై రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొందరి కళ్లు ఎర్రబడ్డాయి. అధికారం తమదేనన్న అహంకారంతో సాగిస్తున్న దౌర్జన్యాలు పెచ్చుమీరాయి. ఇప్పటి వరకూ రాజకీయ కక్షతో దాడులకు తెగబడుతుండగా... తాజాగా ఓ బడుగు బతుకుపోరుపై దౌర్జన్యానికి దిగారు. తమను కాదనందుకు మహిళ అని కూడా చూడకుండా విచక్షణారహితంగా దాడి చేశారు. ఘటనలో తీవ్రంగా గాయపడిన బాధితురాలు ఆస్పత్రి పాలైంది. బాధితులు తెలిపిన మేరకు...

ఉన్నది ఒక్కటే బతుకు మార్గం..

చిలమత్తూరు మండలం సరిహద్దున 44వ జాతీయ రహదారిపై అంజనీతండా గ్రామం వద్ద దేమకేతేపల్లికి చెందిన నాగభూషణరెడ్డి ఓమ్నీ వాహనం ద్వారా మొబైల్ క్యాంటీన్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఒకటి రెండు కాదు... ఏడేళ్లుగా ఆ కుటుంబానికి ఇది ఒక్కటే జీవనోపాధి. వంటకాలు రుచిగా ఉండడంతో స్థానికులతో పాటు ఆ మార్గంలో ప్రయాణిస్తున్న వాహనదారులు అక్కడే ఆగి టిఫెన్, భోజనాలు చేసి వెళుతుంటారు. వీరు ఏర్పాటు చేసిన మొబైల్ క్యాంటీన్ తరహాలోనే మరికొన్ని ఉన్నా... వారికి తగినంత వ్యాపారం ఉండేది కాదు. దీంతో నాగభూషణరెడ్డిపై కక్ష పెంచుకున్న వారు స్థానిక టీడీపీ నేతలతో ఒప్పందం చేసుకుని అక్కడి నుంచి వారిని ఖాళీ చేయించేలా పావులు కదిపారు.

తారస్థాయికి చేరుకున్న వేధింపులు..

తమ స్వలాభాన్ని చూసుకున్న స్థానిక టీడీపీ నేతలు... నాగభూషణరెడ్డి నిర్వహిస్తున్న మొబైల్ క్యాంటీన్‌ను అక్కడి నుంచి ఖాళీ చేయాలంటూ ఒత్తిడి చేశారు. దీంతో తప్పనిపరిస్థితుల్లో తన మొబైల్ క్యాంటీన్‌ను అక్కడి నుంచి కాస్త పక్కకు నాగభూషణరెడ్డి జరిపాడు. అయినా టీడీపీ నేతలు పట్టువీడలేదు. అక్కడి నుంచి కూడా ఖాళీ చేయాల్సిందేనంటూ పట్టుబట్టారు. తమ మాట వినకపోతే పరిస్థితి దారుణంగా ఉంటుందని హెచ్చరించారు. అయితే తనకున్న ఏకైక జీవనాధారాన్ని కోల్పోవడం ఇష్టంలేని నాగభూషణరెడ్డి ఎనిమిది నెలలుగా ఒత్తిళ్లను భరిస్తూ వచ్చాడు.

కేసు వాపసు తీసుకోకపోతే జైలే గతి..

గురువారం నాగభూషణరెడ్డి నిర్వహిస్తున్న మొబైల్ క్యాంటీన్ వద్దకు చేరుకున్న టీడీపీ నేతలు... అక్కడి నుంచి ఖాళీ చేయాలంటూ గొడవకు దిగారు. 8 నెలలుగా చెబుతున్నా లెక్క చేయడం లేదంటూ వాగ్వాదానికి దిగి చేతికి అందుబాటులో ఉన్న ఇనుప వస్తువులతో దాడికి తెగబడ్డారు. అడ్డుకోబోయిన నాగభూషణరెడ్డి భార్య పుష్పవతిపై విచక్షణారహితంగా దాడి చేయడంతో మూగదెబ్బలు తగిలాయి. విలువైన వస్తు సామగ్రిని ధ్వంసం చేశారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే కేసు నమోదుకు పోలీసులు వెనుకంజ వేశారు. పైగా దాడి చేసిన వారు ఎస్టీలని... వారు ప్రతిగా ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి జైలుకు పంపుతామంటూ ఓ కానిస్టేబులు బెదిరింపులకు దిగాడు. దీంతో బాధితులు భయాందోళనకు గురై నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపికను కలసి తమకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. కేవలం వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులన్న ఒకేఒక్క కారణంతో జీవనోపాధిని దెబ్బతీసేలా టీడీపీ నేతలు వ్యవహరించిన తీరుపై దీపిక మండిపడ్డారు. ఈ అంశంపై పోలీసులు స్పందించి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు, సామాన్యులపై దాడులు చేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు.

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు

- అన్ని ఏర్పాట్లు పూర్తి చేయండి
- అధికారులకు డీఆర్‌ఓ ఆదేశం



ఇంటర్ పరీక్షల నిర్వహణపై సమీక్షిస్తున్న డీఆర్‌ఓ విజయసారథి

ప్రశాంతి నిలయం: ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు సంబంధితశాఖ అధికారులు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని డీఆర్‌ఓ విజయ సారథి ఆదేశించారు. గురువారం ఉదయం జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో 12 శాఖల అధికారులతో పరీక్షల నిర్వహణపై సమన్వయ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడుతూ ఫిబ్రవరి 1 నుంచి 20 వరకూ జరిగే ప్రాక్టికల్ పరీక్షలు, మార్చి1 నుంచి 20 వరకూ జరిగే పబ్లిక్ పరీక్షలు జరగనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణలో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పరీక్ష కేంద్రాల్లో లైట్లు, టాయిలెట్లు, డెస్కులు తదితర ఫర్నీచర్ సక్రమంగా ఉండేలా చూడాలన్నారు. అలాగే ఇప్పటి వరకూ తీసుకున్న చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. పరీక్షల నిర్వహణ ఎలాంటి ఇబ్బందులు ఉన్నా వాటి పరిష్కారానికి జిల్లా యంత్రాంగం పూర్తిగా సహకరిస్తుందన్నారు. పరీక్ష కేంద్రాల్లో ఎట్టి పరిస్థితుల్లో మొబైల్, వాచ్, ఎల్రక్టానిక్ తదితర వస్తువులు అనుమతించ చూడదని డీఆర్‌ఓ ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించి పోలీస్ బందోబస్తు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, 200 మీటర్ల దూరంలో ఉన్న జిరాక్స్ కేంద్రాలను తప్పనిసరిగా మూసి వేయించేలా చూడాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆయా పరీక్షా కేంద్రాల వద్ద అత్యవసర మందులతో పాటు వైద్య సిబ్బంది విధులు నిర్వహించేలా చర్యలు చేపట్టాలన్నారు. మెడికల్ కిట్స్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. పోలీసు బందోబస్తు, ఫ్లయింగ్ స్క్వాడ్ విధి విధానాలు, ప్రశ్న పత్రాలు, జవాబు పత్రాల తరలింపు తదితర అంశాలపై ఆయా శాఖ అధికారులు దృష్టి సారించాలన్నారు. ఏపీఎస్‌ఆర్టీసీ ఆధ్వర్యంలో పరీక్షా కేంద్రాలకు హాజరయ్యే విద్యార్థుల సౌకర్యార్థం ఆయా వేళల్లో బస్సులు నడిచేలా చూడాలన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, డీఐఈఓ రఘునాథరెడ్డి, పరీక్షల నిర్వహణ స్పెషల్ ఆఫీసర్ చెన్నకేశవప్రసాద్, ఆర్టీసీ డీఎం వినాయకులు, ఆర్టీసీ డీఎం ఇనాయతుల్లా తదితరులు పాల్గొన్నారు.

కిరాణా దుకాణాల్లో చోరీ



చోరీ జరిగిన దుకాణాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

పుట్టపర్తి అర్బన్: కొత్తచెరువులోని బుక్కపట్నం రోడ్డులో ఉన్న రెండు కిరాణా దుకాణాల్లో బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఓ దుకాణంలో రూ.1.50 లక్షలు, మరో దుకాణంలో సిగరెట్ బండిళ్లను అపహరించారు. సమాచారం అందుకున్న డీఎస్పీ విజయ్‌కుమార్, సీఐ ఇందిరా అక్కడకు చేరుకుని పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, సీసీ పుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.

- ఓడీచెరువు: మండల కేంద్రం నడిబొడ్డున, పోలీసుస్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న మూడు దుకాణాల్లో బుధవారం రాత్రి చోరీ జరిగింది. వివరాలు.. రెండు కిరాణా షాపులు, ఓ మెడికల్ స్టోర్‌లో చొరబడిన దుండగులు... రూ.35 వేల నగదు, నిత్యావసరాలు అపహరించారు. దుండగులు కారులో వచ్చినట్లు సీసీ కెమెరా పుటేజీల్లో నిక్షిప్తమై ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, సీసీ పుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీఓ ఆనందకుమార్

అగళి: ఇసుకను అక్రమంగా కర్ణాటక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఆర్డీఓ ఆనందకుమార్ హెచ్చరించారు. అక్రమ తరలింపులు అరికట్టేలా అగళి మండల సరిహద్దులో నిఘా ఏర్పాటు చేయనున్న స్థలాన్ని గురువారం ఆయన పరిశీలించారు. కర్ణాటక సరిహద్దున ఉన్న కదిరేపల్లి, నందరాజనపల్లి నుంచి అక్రమంగా ఇసుక తరలించకుండా చెక్‌పోస్టును ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇండెంట్ లేకుండా ఇసుక రవాణా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఇరిగేపల్లి గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్బారావు, ఆర్ఐ చంద్రశేఖరరావు, వీఆర్‌ఓ నరసింహమూర్తి, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఇల్లాలి చదువు.. ఇంటికి వెలుగు



మహిళా చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జడ్జి శివప్రసాద్‌యాదవ్

గార్లదిన్నె: చదువుకున్న భార్య ఉంటే ఆ ఇల్లు అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి శివప్రసాద్‌యాదవ్ అన్నారు. గార్లదిన్నెలోని రైతు సేవా కేంద్రంలో జాతీయ న్యాయసేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో గురువారం మహిళా న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా జడ్జి శివప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్క మహిళా చదువుకోవాలన్నారు. సమాజంలో మహిళల పట్ల వివక్ష చూపరాదన్నారు. ప్రతి ఒక్కరూ మహిళా చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడులు, అన్యాయాలు అరికట్టడానికి అమలులో ఉన్న చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళలు, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వారు ఎవరైనా కోర్టు కేసుల్లో వాదనలు వినిపించడానికి ఉచిత న్యాయ సహాయం కోసం జాతీయ లోక్ అదాలత్ సంస్థలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు హరికృష్ణ, పద్మజ, తహసీల్దార్ ఈరమ్మ, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ బాబాఫకృద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

అనంత అరసవల్లి.. బూదగవి

జిల్లాలో ఎన్నో పురాతన దేవాలయాలు ఉన్నాయి. అయితే సమస్తలోకాలకు వెలుగును ప్రసాదించే సూర్యభగవానుడి అరుదైన ప్రాచీన ఆలయం ఉరవకొండ మండలం బూదగవిలో ఉంది. ఈ ఆలయం అనంత అరసవల్లిగా విరాజిల్లుతోంది. ఈ ఆలయ విశిష్టతలపై రథసప్తమిని పురస్కరించుకుని 'సాక్షి' కథనం.

- 3 నుంచి బూదగవి సూర్య దేవాలయంలో రథసప్తమి వేడుకలు ప్రారంభం
- దక్షిణాభిముఖంగా వెలసిన ఏకైక దేవాలయం
- రాష్ట్రంలో రెండవది, దక్షిణ భారత దేశంలో మూడవదిగా గుర్తింపు





ఎన్నో విశిష్టతలున్న ఆలయంలోని శివలింగం, బూదగవి సూర్యనారాయణస్వామి ఆలయం



సూర్యనారాయణస్వామి మూలవిరాట్

ఉరవకొండ: దక్షిణ భారతదేశంలోనే అరుదైన ఆలయంగా బూదగవిలోని సూర్యదేవాలయం ఖ్యాతి గాంచింది. ఒడిశాలోని కోణార్క్, శ్రీకాకుళం జిల్లా అరసవెల్లి తర్వాత బూదగవిలోని ఆలయానికి అంతటి ప్రాముఖ్యత ఉంది. 13వ శతాబ్దంలో చాళుక్యులు ఈ ఆలయాన్ని నిర్మించినట్లు ఇక్కడి శాసనం ద్వారా తెలుస్తోంది. గర్భగుడిలో దక్షిణాభిముఖంగా సూర్యభగవానుడి మూలవిరాట్ ఉంది. ఈ అభిముఖంతో దేశంలో మరెక్కడా సూర్యభగవానుడి ఆలయాలు లేవని ఆధ్యాత్మిక వేత్తలు చెబుతున్నారు. మూలవిరాట్‌కు ఇరువైపులా దేవతా ప్రతిమలు ఒకే శిలలో చెక్కబడి ఉన్నాయి. అలాగే సూర్యభగవానుడి విగ్రహం ఎదుట నేలపై పరిచిన బండలపై సూర్య నమస్కారం చేస్తున్న మనిషి రూపాన్ని చెక్కారు. ఆలయం మొత్తం ఎటూ చూసిన కేవలం మూడు రాళ్లతో నిర్మించినట్లుగా గమనించవచ్చు. ఆలయంలో తూర్పు ముఖంగా అరుదైన శివలింగం నిత్య పూజలు అందుకుంటోంది. ఈ శివలింగం ఉపరితలంలో అమర్‌నాథ్‌లోని జ్యోతిర్లింగం ఆనవాళ్లు కన్పించడం విశేషం. రాష్ట్రంలో రెండవదిగా దక్షిణ భారతదేశంలో 3వదిగా భారతదేశంలో 8వదిగా ఈ ఆలయాన్ని పరిగణిస్తున్నారు.

మూలవిరాట్ పాదాలను తాకనున్న సూర్యకిరణాలు..

ఏటా రథసప్తమి పర్వదినం రోజు ఆలయంలో ఉదయం సూర్యుడి కిరణాలు నేరుగా గర్భాలయంలోని మూలవిరాట్‌కు తాకుతాయి. తూర్పున ఉదయించే సూర్యుడి కిరణాలు... దక్షిణాభిముఖంగా ఉన్న సూర్యభగవానుడి మూలవిరాట్‌ను తాకే అద్భుత దృశ్యాన్ని చూసేందుకు రాష్ట్రంలోని వివధ జిల్లాల నుంచే కాకుండా పొరుగున ఉన్న కర్ణాటక నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారు. అరుదైన ఈ ఆలయం భగవాన్ సత్యసాయిబాబాను విశేషంగా ఆకట్టుకుంది. ఆలయ విశిష్టతపై అప్పట్లో సత్యసాయి సమగ్ర అధ్యయనం చేయాలని తన శిష్యులను ఆదేశించారు. ఆలయం విశిష్టతను పుస్తక రూపంలో తీసుకోరావాలని సత్యసాయి అప్పట్లో ప్రయత్నించినట్లు గ్రామస్తులు నేటికీ గుర్తు చేసుకుంటున్నారు.

3 నుంచి రథసప్తమి ఉత్సవాలు..

బూదగవి సూర్యదేవాలయంలో ఫిబ్రవరి 3న రథసప్తమి వేడుకలు ప్రారంభం కానున్నాయి. రెండు రోజుల పాటు అత్యంత వైభవంగా వేడుకలను నిర్వహిస్తారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. 3న ఆలయంలో విశేష హోమాలు నిర్వహించనున్నారు. 4న రథసప్తమి సందర్భంగా స్వామి వారికి విశేష అభిషేకాలు, పూజలు, నిర్వహించి, ఛాయ, ఉషా సమేత సూర్యనారాయణస్వామి కల్యాణోత్సవాన్ని వేడుకగా నిర్వహించనున్నారు.

పూర్తి స్థాయి వసతులు కల్పించాం



ఫిబ్రవరి 3న రథసప్తమి వేడుకలు ప్రారంభం కానున్నాయి. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగున ఉన్న కర్ణాటక నుంచి పెద్ద సంఖ్యలో తరలి వచ్చే భక్తులు ఎలాంటి అసౌకర్యాలకు గురికాకుండా పూర్తి స్థాయి వసతులు కల్పించాం. సజావుగా దైవ దర్శనం చేసుకునేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. భక్తులకు తాగునీరు, అన్నప్రసాదాలు అందుబాటులో ఉంచనున్నాం. రథసప్తమి నాడు సూర్యభగవానుడిని దర్శించుకుని ఆయన కృపకు పాత్రులు కావాలని భక్తులకు మనవి చేస్తున్నాం.

– ఛత్రగుడి చిరంజీవి, ఆలయ చైర్మన్, బూదగవి